కథ

# స్మోకింగ్

అత్తిరిల్లి బాపు సుబ్రహ్మణ్యం

**పద్మాకర్ ఇల్లు చేరేసరికి, అదొక రణరంగంలా వుంది. పిల్లలిద్దరూ గ్రుక్క తిప్పుకోకుండా, ఆరున్నొక్క రాగాలాపనలో వుండగా వాళ్లను సముదాయించడం సొంపుకాబోలు, వినోదిని వాళ్ళను మించి, ఇంటి పై కప్పు ఎగిరిపోయేలా, కేకలు వేస్తూ, హడావిడి చేస్తూంది. అతడ్ని చూడగానే పిల్లలు ఏడుపులాపేసారు. అతని దగ్గర వాళ్లకామాత్రం భయం వుంది; తల్లి దగ్గర మాత్రం అసలే లేదు- మాట్లాడితే, కొడుతుందని. అయితే, వాళ్ళింకా వెక్కుతున్నారు.**

పద్మాకర్ని చూడగానే వినోదిని అగ్గి మీద గుగ్గిలమయింది. ''అయ్యాయా, అయ్యగారి బలాదూరు తిరుగుళ్లూ! ఈ పాటికైనా తంవకు ఇల్లు గుర్తొచ్చింది- సంతోషం! వీళ్లిద్దరూ రానురానూ రాక్షసులైపోతున్నారు- నా పాలిటికి. కాల్చుకు తింటున్నారు. నేం చెప్పిన మాట సుతరామూ వినరు కదా! మీరేమో ఆఫీసు నుండి తిన్నగా ఇంటికి రాకుండా, ఏవేవో రాచకార్యాలు వెలగబెడ్తారు- ఇల్లూ, ఇల్లాలూ, పిల్లలూ వున్నారన్న సంగతి పూర్తిగా మరిచిపోయి! మీకేం, మీరు మగ మహారాజులు! ఇంట్లో పరిస్థితి ఎలాగున్నా, ఊరేగడానికి బోలెడంత టైమూ, స్వేచ్ఛా మీకున్నాయి. నేనీ సంసార సాగరాన్ని ఇంకెంత మాత్రం ఈదలేను బాబూ! తిన్నగా మా అమ్మ దగ్గరికి వెళ్లిపోతాను. మీరూ, పిల్లలూ హాయిగా వుండండి-'' అంది చిటపటలాడుతూ.

పద్మాకర్ విసుగ్గా ముఖం చిట్లించాడు: ''మొదలెట్టావూ నీ సొద! ఇంటికి మనిషొస్తే ఒక్క నిమిషమైనా వూపిరి తీసుకోనివ్వవు కదా! బైట నేనేదో మహా సుఖపడిపోతున్నట్టు, ఒకటే గోలగోల చేస్తావిలా! రాను రానూ నాకు ఇంటికి రావాలంటేనే భయమేస్తోంది. అందుకే అన్నారేమో 'ఇంటి కంటే గుడి పదిలం' అని. నేనేమీ ఊర్లో షికార్లు వెలగబెట్టి రాలేదిప్పటి దాకా! ఆఫీసులో నా ప్రక్కసీటతను సెలవు పెట్టాడని, అతని పని కొంచెం చూడమని మేనేజర్ నన్ను రిక్వెస్ట్ చేశాడు. అది పూర్తయినప్పటికి ఇదిగో ఈ సమయమయింది. అలిసిపోయి వళ్లు నొప్పుల్తో నేనింటికి వచ్చేసరికి, మహా బాగా ఇచ్చావులే స్వాగత సన్మానం! విశ్రాంతి తీసుకోడానికి కూడా ఇంటికి రాకూడదేం, నా ఖర్మ కాబోతే? మాట్లాడితే అమ్మ కూచిలా మా పుట్టింటికెళ్ళిపోతానని తర్జని, బెదిరింపులొకటి నాకు! అంత కష్టమేం పెట్టాను నిన్ను? ఇకపోతే, పిల్లలన్నాక అల్లరి చేయరా? అసలేం జరిగిందో అరచి గీపెట్టక, నిదానంగా చెప్తే, నేను సరిదిద్ద ప్రయత్నిస్తాను కదా?''

వినోదిని మూతి మూడు వంకర్లూ తిప్పింది. ''పెళ్లైన దగ్గర్నుండీ ఒహటే చూస్తున్నాను కదా మీరూ, మీ సరిదిద్దడాలూ! ఎన్నిసార్లు నా ముద్దూ ముచ్చట్లూ తీర్చారు? సరదాగా ఒక సినిమాకో, షికారుకో పోడం ఎటూ లేదు- నేనూ సరిపెట్టుకొని వూరుకున్నాను. కనీసం ఏరికోరి కన్న సంతానం - వాళ్ళ సరదాలైనా ఎప్పుడైనా తీర్చేరా మీరు? తోటి పిల్లలంతా సినిమాలని, షికార్లని సరదాలు చిత్తగిస్తూవుంటే, వీళ్లేమో బిక్క ముఖాలేసుకుని, బిక్కు బిక్కుమంటూ, ఇంట్లోనే పడి ఏడుస్తున్నారు-''

పద్మాకర్కి విపరీతంగా కోపం వచ్చింది. కాని, ఒక్క క్షణం తమాయించుకున్నాడు. ఇంటికి పెద్దైన తను ఉద్రేకపడి లాభం లేదనుకున్నాడు. ఎంతైనా, కోరి పెళ్ళాడిన భార్యనీ, ముచ్చటపడి కన్న పిల్లల్నీ బుజ్జగించవలసిన బాధ్యత తన మీదే వుంది కదా అనుకొని శాంత స్వరంతో అన్నాడిలా: ''చూడు, వినూ! ఆవేశం కాస్త తగ్గించుకుని, కొంచెం శాంతంగా నేను చెప్పేది విను. నువ్వన్నవన్నీ నిజమే! కాదనను. భర్తగా నిన్ను, తండ్రిగా వాళ్లను సుఖపెట్టవలసిన బాధ్యత నా మీదే వుంది. కాని, మన ఆర్థిక పరిస్థితులు నీకు తెలియని వేమీ కాదు! నేనెంత తెచ్చినా, అది మన తిండికే సరిపోవడం లేదు- ఇక విలాసంగా జీవితాలెట్లా గడపగలం? నాకూ మిమ్మల్ని సాయంకాలాల్లో, ఏ సినిమాకో, ఎగ్జిబిషన్కో, సర్కస్కో, మాల్కో తీసుకెళ్ళాలనే వుంటోంది. వీళ్ల స్కూల్ ఫీజులూ, ఆటో ఛార్జీలూ, యూనిఫామ్లూ, పుస్తకాలూ - ఒక్కటనేమిటి? సర్వం నా ఒక్క జీతం మీదే కదూ నడవాలి? అసలు మన పెళ్లైన తర్వాత- ఒక ఐదేళ్ళ దాకా ఈ పిల్లలూ జంజాటం నేను వద్దంటే నువ్వేమన్నావ్, గుర్తుందా? పిల్లల్లేని ఇల్లొక ఇల్లా? వాళ్ల ముద్దూ మురిపాలూ, ఆటాపాటలూ, చిలిపి చేష్టలూ, తప్పటడుగులూ, బోసి పలుకులూ-' అంటూ ఏదోదో మాట్లాడావు. 'వాళ్లిచ్చే ఆనందం ప్రపంచంలో వేరే ఏదిస్తుంది? పైగా, చిన్నప్పట్నుండీ నీకు పిల్లలంటే బాగా ముద్దు' అన్నావు. 'నేను చేస్తున్న ఉద్యోగానికొచ్చే రాబడికి మనిద్దరమే తిన్నగా సుఖపడలేకపోతున్నాం. ఇహ, పిల్లలు పుట్టుకొచ్చారంటే మరీ కష్టం. వాళ్లని కనగానే సరా, వాళ్లకి సక్రమంగా కూడూ గుడ్డా ఇచ్చి, పెంచాలి. చదువూ, సంధ్యా చెప్పించి - ప్రయోజకుల్ని చేయాలి. వీటన్నింటికీ మన, ప్రస్తుత రాబడి సరిపోదు. కాబట్టి కొన్నాళ్ళు ఆగుదామంటే నువ్వు 'ససేమిరా' అన్నావు. ఏం? నాకు మాత్రం పిల్లలంటే ఇష్టం లేదా? ముద్దు వుండదా - అందుకే 'సరే' నన్నాను. పెద్దవాడు పుట్టాడు. 'పోనీ, ఈసారి నుంచి జాగ్రత్త పడదామా' అంటే నువ్వేమన్నావ్? 'ఊహూ! ఒక మగపిల్లాడూ, ఆడపిల్లా అయితే చూడ ముచ్చటగా వుంటుంద'న్నావ్. అది పుట్టింది. వాళ్లిద్దరితో ఖర్చులూ పెరిగాయి; రాబడి మాత్రం పెద్దగా పెరగలేదు. ఆ రోజుల్లో మనం నెలకొకటీ, రెండూ సినిమాలైనా చూసేవాళ్లం; ఇప్పుడార్నెల్లకొక సినిమా కూడా చూడలేకపోతున్నాం-'' పద్మాకర్ ఆగి ముఖానికి పట్టిన స్వేద బిందువుల్ని తుడుచుకొంటూ- ''ఇంతకీ వాళ్లు నిన్నిప్పుడు సినిమా కోసం విసిగిస్తున్నారా?'' అనడిగేడు.

''అయ్యో రామా! అంతదృష్టం వాళ్లకెక్కడేడ్చింది? మన కడుపున పుట్టినోళ్లకి అంత భాగ్యం కూడానా?'' వ్యంగ్యంగా జవాబిచ్చింది. ''ఇవ్వాళ బియ్యం నిండు

## Story



కున్నాయి. మరేం చేద్దామన్నా ఏదీ లేదింట్లో. మీకు ఉదయమే చెప్పేను. అయినా మరచిపోయినట్టున్నారు. ఇంకేముంది– ఆకలవడంతో తట్టుకోలేక ఏడుస్తున్నారు''

''ఓహ్! బియ్యం అయిపోయాయి కదూ! అవున్నాకు జ్ఞాపకమే లేదు. ఉన్నా ఏం లాభం? డబ్బులున్నాయి కనుకనా తెచ్చి పడేయడానికి? పోనీ, పక్కింటావిడ్ని అడిగి చూడక పోయావా?''

''ఇప్పటికే ఆవిడ దగ్గర 5, 6, కేజీల దాకా అప్పు తెచ్చాను. మళ్లా అడగలేను బాబూ, నాకు సిగ్గు వేస్తుంది! తెచ్చిందిప్పటి దాకా తీర్చిందీ లేదు, తిరిగి ఏ ముఖం వేసుకొని వెళ్లి అడగను? నా వల్ల కాదు, బాబూ! అయినా, ఉదయం చెప్పాను కదా మీరు తెస్తారనుకున్నాను''

పద్మాకర్ శుష్కహాసం చేశాడు. ''నా వద్ద డబ్బుంటే ఎందుకాలస్యం చేస్తాను? పోనీ, ఇప్పుడు నా గొడవెందుకు గాని జరగవలసింది చూడు, వినూ, ప్లీజ్! నా కోసం కాకపోయినా, పిల్లల కోసం వెళ్లి, కనీసం అరకేజీ

బియ్యమైనా తెచ్చి, వాళ్లకింత వండిపెట్టు- మనకు లేకపోయినా ఫర్వాలేదు. చిన్నవెధవలు, చూడు పాపమెలా అల్లాడుతున్నారో ఆకలికి!'' అన్నాడు జాలిగా.

వినోదిని ఏమనుకుందో గాని తటాలున లేచి, ప్రక్కింటికేసి వెళ్ళింది.

'ఉసూరు'మంటూ ఒక కాలు విరిగిన కుర్చీలో కూలబడ్డాడు పద్మాకర్. లేవని తెలిసినా ప్యాంటు జేబులోనికి చెయ్యి పోనిచ్చాడు. శూన్య హస్తం తిరిగొచ్చింది. తిరిగి ఆమూలాగ్రం వెదికాడు. అతని శ్రమ ఫలించినట్టుగా, ఒక ఐదు రూపాయల నాణెం వెలుగు చూసింది. అసహనంగా నిట్టూర్చాడు.

ఇంతలో పెద్దవాడు దగ్గరగా వచ్చాడు, ''నాన్నా'' అంటూ.

''ఏం, నాయనా?'' ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని, వళ్లో కూర్చోబెట్టుకున్నాడు. ''మరేం-'' వాడికి నోరు పెగలడం లేదు. అంతగా జ్ఞానం రాకపోయినా, ఇంటి పరిస్థితులు చూచాయగా తెలుసువాడికి. తను చెప్పబోయే సంగతి తండ్రిలో ఎటువంటి మార్పు తేగలదో వూహించగలడు. అందుకే నీళ్లు నములుతూ ఉండిపోయాడు.

''చెప్పరా బాబూ, అసలు సంగతేవిటో? నువ్వు ధైర్యంగా చెప్పకపోతే, నాకెట్లారా తెలిసేది?'' బుజ్జగిస్తున్నట్టు అడిగాడు, మనసులో విరక్తిగా నవ్వుకుంటూ. తన జేబులో ప్రస్తుతం ఉన్న ఏకైక ఐదు రూపాయల కాయిన్తో వాళ్ల ఈతి బాధలు కాదుకదా, ఏ బాధలూ దూరం చేయలేనని తెలుసు పద్మాకర్‌కి.

''రేపట్లోగా స్కూల్ ఫీజు కట్టకపోతే, ఇక పేరు రిజిష్టర్‌లోంచి తీసేస్తామని చెప్పారు టీచర్. ఇప్పటికే చాలా అవకాశాలు ఇచ్చామని, మరింక ఇవ్వలేమని చెప్పారు. ఫైన్‌తో కట్టే తేదీలు కూడా వెళ్లి పోయాయి. అందుచేత-'' నసుగుతూ చెప్పాడు.

పద్మాకర్‌కి విషయమర్మమయింది. అవును! ఫీజు కట్టకపోతే వాడి పేరు తీసేసి, ఇంటికి సాగనంపుతారు. ఇంటికి కావలసిన రేషన్ రేపటికైనా తను తేలేకపోతే, కొన్ని రోజుల్లో ఈ ఇంట్లో ఒకరో, ఇద్దరో లేక అందరో కీర్తిశేషులవడం మటుకు ఖాయం!

పద్మాకర్ ఇక నిమ్మళంగా కూర్చోలేక పోయాడు. లేచి నించొని, అక్కడక్కడ అతుకులున్న చొక్కాతీసి, యధాప్రకారంగా తొడుక్కున్నాడు.

వినోదిని చేతిలో చిన్న సంచీతో అప్పుడే వచ్చింది. ''ఎలాగో ఇచ్చింది లెండి, పుణ్యాత్మురాలు! మీరెక్కడికప్పుడే బయల్దేరారు? ఇలా వచ్చీ గంటయినా అయిందో లేదో! అయినా, ఒక్క నిమిషమైనా మీకు ఇంట్లో కాలు నిలవదు కదా! బైటెవరు పిలుస్తున్నారప్పుడే?'' తన సహజ ధోరణిలో కస్సుబుస్సు లాడసాగింది.

పద్మాకర్ అసహనంగా చూశాడు. ''ఎందుకు, వినూ! అలా వెనకా ముందు చూడకుండా, ఆలోచించకుండా ఆడిపోసుకుంటావు? నేనేమీ చక్కర్లు కొట్టడానికి బైటికి వెళ్లడం లేదీ చలిలో! పెద్దాడికి ఫీజు కట్టకపోతే పేరు తీసేస్తారట; ఇంటికి కావల్సిన వెచ్చాలు రేపటికైనా తెచ్చుకోకపోతే, మనందరి ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోతాయి, ఇంకొద్ది రోజుల్లో!! అందుకే ఎక్కడైనా అప్పు పుట్టుందేమోనని బయల్దేరబోతున్నానిలా-''

''అయితే, ఓకే, కాని, అన్నమయిపోతుంది ఐదు నిమిషాల్లో, ఇంత కతికి వెళ్లండి, ప్రొద్దున్ననగా ఎప్పుడు తిన్నారో ఏమో- ఆకలిగా లేదూ! మీ వాలకం చూస్తే, ముఖం తిరిగి పడిపోయే వారిలా వున్నారు-'' అంతలో ప్రేమ, ఆపేక్షలు కలుగుతాయి వినోదినికి.

అతను ఆశ్చర్యపోలేదు. వినోదిని సహజంగా మంచి ఇల్లాలే! అందులో ఎటువంటి సందేహం లేదు. తనంటే చచ్చేంత ప్రేమాభిమానాలు ఆమెలో పుష్కళంగా వున్నాయి. కాని, ఈ దారిద్ర్యానికి ఎలాంటి వాళ్లనైనా ఆమూలాగ్రంగా మార్చేయగలిగే శక్తి వుంది. కడుపునిండా తిండీ, కంటినిండా నిద్రా పొందే మానవుడు ఇతరులకు ఎన్ని నీతులైనా చెప్తాడు. అవి కరవయ్యేసరికి, ఎక్కడలేని నిస్పృహ యతా, కోపతాపాలు తలెత్తుతాయి! వాటినెదురుగా వుండే వాళ్ల మీద చూపిస్తుందంతే!

''నా కోసం ఎదురు చూడొద్దు, వినూ! నువ్వూ, పిల్లలూ ముందు ఆకలి తీర్చుకొని, పడుకోండి. మీరెవరూ అర్థాకలితో పరుండవద్దు. మిగిలితేనే నాకింత ఉంచు. నేను మంచినీళ్లైనా తాగి గడపగలను. ఇంకా ఆలస్యం చేశానంటే, రాత్రి గడుస్తున్న కొద్దీ చలి అధికమవుతుంది. ఆ చలిలో అంతా వెచ్చగా, దుప్పట్లలో దూరి నిద్రపోతారు. ఎవరూ తలుపులైనా తీయకపోవచ్చు. అందుకే నేను బయల్దేరుతాను-'' అంటూ అక్కడితో సంభాషణలకి ఫుల్‌స్టాప్ పెట్టి హడావిడిగా కదిలిపోయాడు పద్మాకర్.

***

హఠాత్తుగా- ఆ చలిలో ఒక సిగరెట్ కాల్చాలనిపించింది అతడికి. నిజానికి పద్మాకర్‌కి స్మోకింగ్ అంటేనే పడదు. ఎప్పుడేనా ఒకటీ, అరా కాల్చినా కూడా- ధూమ పానానికి వ్యతిరేకమే అతను! ఫ్రెండ్స్‌తో కూడా ఎప్పుడూ ఆర్గ్యూ చేస్తుంటాడు- సిగరెట్ స్మోకింగ్‌కి వ్యతిరేకంగా.

రాత్రి తొమ్మిదిన్నరో, పదో అవుతోంది. శీతాకాలం చలి గజగజ వణికిస్తూంది. మంచు కూడా కురుస్తోంది. పద్మాకర్ ఋణ ప్రయత్నాలన్నీ విఫలమవగా, నిరాశతో ఇంటి దారి పట్టాడు. తెలిసిన వాళ్లనందరినీ అడిగి చూశాడు. కాని, నెలాఖరు వారమవడం చేత ఎవ్వరూ కనీసం యాభై రూపాయలైనా ఇవ్వలేకపోయారు.

చలిగాలి రివ్వున వీస్తూ, చెవుల్లోంచి దూసుకుపోతూంది. ఒళ్లంతా గజగజ వణికిస్తూంది. పెదవులు అదురుతున్నాయి; నాలుక పొడిబారుతోంది. ఇక క్షుద్బాధ సరేసరి! కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి.

రోడ్ మీద అట్టే జనం కూడా లేరు. ఉన్న వాళ్లు ఉలెన్ స్వెట్టర్లో, మఫ్లర్లో, ఫుల్ సూట్లో ధరించి వున్నారు. అంతా కాకపోయినా, కొంత వరకైనా చలిని ప్రతిఘటిస్తున్నారు.

పద్మాకర్‌కి ఉన్నట్టుండి నవ్వొచ్చింది. తనలాంటి అప్రయోజకుడు లోకంలో ఎవడూ ఉండడేమోనను కున్నాడు. భార్యా పిల్లల్నీ సరిగా చూడలేని, పోషించలేని తనదీ ఒక బ్రతుకేనా? తనసలు ఒక మనిషేనా? అనుకొన్నాడు.

అసలు తనకి కొన్ని విషయాలు టైముకి తట్టవేమో? సాయంకాలం ఆఫీసులో బాసు మెప్పు కోసం- శెలవు పెట్టిన శరశ్చంద్ర సీటుపని సిన్సియర్‌గా చేసుకొచ్చాడు. అప్పుడు- బయల్దేరేముందు, మేనేజర్ని అడిగితే, ఎంతో కొంత అప్పిచ్చేవాడు కదా?

అంతెందుకు? రోజంతా ఆఫీసులో తనని చాలా మంది కలుస్తూనే వున్నారు. తనూ చాలా మందితో, టీ టైమ్‌లో, లంచ్ అవర్లో బాతాఖానీ సాగించాడు. వాళ్లలో ఏ ఒక్కర్ని అడిగివున్నా, తనకెంతో కొంత ఇచ్చుండే వాళ్లు కదా!

ఆ సమయంలో రివ్వున పద్మాకర్ ప్రక్క నుండీ దూసుకుపోయిందో సైకిల్. కేర్లెస్‌గా సిగరెట్ పొగ వదుల్తూ, మితిమీరిన వేగంతో పోతున్నాడో అబ్బాయి. బహుశా స్టూడెంటేమో! పద్మాకర్ నాసికా పుటాలకి ఆ 'స్మెల్' మత్తు మందులా సోకింది.

హఠాత్తుగా- ఆ చలిలో ఒక సిగరెట్ కాల్చాలని పించింది అతడికి. నిజానికి పద్మాకర్‌కి స్మోకింగ్ అంటే పడదు. ఎప్పుడేనా ఒకటీ, అరా కాల్చినా కూడా- ధూమ పానానికి వ్యతిరేకమే అతను! ఫ్రెండ్స్‌తో కూడా ఎప్పుడూ ఆర్గ్యూ చేస్తుంటాడు- సిగరెట్ స్మోకింగ్‌కి వ్యతిరేకంగా.

'ఎవరో వచ్చి ఈ ప్రొహిబిషన్‌ని అమలు చేయరు. చదువుకున్న మనమే తెలుసుకుని, మనం మన వంతుగా మాని, మనకు తారసపడే ఇతరుల చేత కూడా మానిపించడానికి ట్రై చేయాలి! మన ఎదురుగా ఎవరు పొగ పీల్చినా 'నాకెందుకులే'నని వూరుకోకుండా, అతనికి స్మోకింగ్ వలన వచ్చే అనర్థాలను, సాదక బాధకాలను విడమరిచి, వివరించి చెప్పాలి. చెప్పగా, చెప్పగా వాళ్లల్లో మార్పు రావచ్చునే'వాడు తన కొలీగ్స్‌తో, స్నేహితులతో.

అలాంటిది- ఇప్పుడు సడన్‌గా కాల్చాలనిపించడానికి చలి వాతావరణం, ఇంట్లో పరిస్థితులూ కారణం కావొచ్చు!

జేబు తడుముకున్నాడు పద్మాకర్. ఐదు రూపాయల కాయిన్ తగిలింది. ఉషారుగా రోడ్డు ప్రక్కనున్న పాన్‌షాప్ కేసి నడవబోయాడు.

''బాబూ!'' పిలుపు విని, ఉలిక్కిపడి, వెనుదిరిగి చూశాడు.

ఒక ముసలాయన వున్నాడక్కడ. బాగా బతికి చెడిన వాడిలా వున్నాడు. గడ్డం, జుత్తు వత్తుగా పెరిగాయి. కళ్లు గుంటల్లా వుండి, శూన్యంలోకి చూస్తున్నట్టున్నాయి. శరీరం పస్తులతో చిక్కి శల్యమైనట్టుంది. కట్టుకున్న దుస్తులేమో చీలికవాలికలై, అసలున్నాయా అన్నట్టున్నాయ్!

''ఈ చలికి తట్టుకోలేక పోతున్నాను, నాయనా! పైగా ఈ క్షుద్బాధ ఒకటి! నిన్ను డిస్టర్బ్ చేశాననుకోకపోతే, కడుపునిండా తిని రెండ్రోజులయ్యింది, నీకు చాతనైనది-''

అతని మాటలకు అడ్డు తగులుతున్నట్టు, పద్మాకర్ తన వద్ద మిగిలిన ఏకైక ఐదు రూపాయల నాణేన్ని అతని చేతిలో పెట్టి, రెండు చేతులూ జోడించాడు. ''నా దగ్గరున్న దింతే! ఏమీ అనుకోకుండా వుంచుకోండి-'' అనేసి వడిగా ఇంటి ముఖం పట్టాడు.

❖